మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం



ఆర్‌డబ్ల్యూసీ ఏఈని నిలదీస్తున్న ఎంపీటీసీ సభ్యుడు రమేశ్

తెలకపల్లి: మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరిపి హడావిడిగా ముగించారు. శనివారం మండల కాంప్లెక్స్ మీటింగ్ హాల్‌లో ఎంపీపీ కొమ్ము మధు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. 11 గంటలకు జరగాల్సిన సమావేశం 12 గంటలకు ప్రారంభమైంది. మొదటగా వ్యవసాయ అధికారి ఏఓ సందీప్‌రెడ్డి వ్యవసాయంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గట్టునెల్లికుదురు ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వ తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రైతుబంధుపై చర్చించారు. విద్యుత్ ఏఈ నాగరాజు సమీక్ష నిర్వహిస్తుండగా ఎంపీటీసీ లేచి అధికార పార్టీ నాయకులను ప్రశ్నించారు. అనంతరం విద్యాశాఖపై ఎంఈఓ చంద్రుడు సమీక్షిస్తుండగా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. అదే విధంగా పశువైద్యాధికారి నాగరాజు యాదవ్‌పై ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. ఈజీఎస్‌పై ఏపీఓ మల్లేశ్ సమీక్ష చేశారు. ఆలేరు ఎంపీటీసీ జింకల ఈశ్వరయ్య మరుగుదొడ్లు నిర్మించుకున్నా ఇప్పటికి బిల్లులు రాలేదని ప్రశ్నించారు. పల్లెప్రకృతిపై గౌరెడ్డిపల్లి సర్పంచ్ వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. నీటి పారుదల అంశంపై ఐబీఏఈ శ్రీకర్‌రెడ్డి సమీక్ష చేస్తుండగా సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. మిషన్ కాకతీయపై ఎంపీటీసీ రమేశ్ అధికారులను ప్రశ్నించారు. పీఆర్‌ఏఈ మల్లారెడ్డి సమీక్ష చేశారు. సీసీ రోడ్ల బిల్లులపై ఎంపీటీసీ విజయలక్ష్మీ ఏఈని నిలదీసింది. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ హనుమంతురావు, జెడ్పీటీసీ సుమిత్ర, డీఎల్‌పీఓ రామ్మోహన్‌రావు, ఎంపీడీఓ చెన్నమ్మ, ఎంపీడీఓ సూపరింటెండెంట్ భాస్కర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన



బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలోని గోరిటలో ఆన్‌లైన్‌లో జరిగే మోసాలను ఆ గ్రామానికి చెందిన యువకులకు శనివారం పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్సై శంకరయ్య మాట్లాడుతూ ఎవరైన ఆన్‌లైన్‌లో మోసానికి గురైతే వారు తప్పనిసరిగా 24 గంటల్లోనే నంబర్.1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆధార్ కార్డు, పాన్‌కార్డు, ఓటీపీ వంటి వ్యక్తిగత సమాచారం అడిగితే సమాచారం ఇవ్వవొద్దని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ బాలస్వామి, శరత్‌గౌడ్, వంశీ పాల్గొన్నారు.

దళితరత్న అవార్డు గ్రహీతకు సన్మానం



కల్వకుర్తిరూరల్: దళితరత్న అవార్డు గ్రహీత రాంపర్వతాలును శనివారం బీఆర్‌ఎస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ గోవర్ధన్ మాట్లాడుతూ కల్వకుర్తి ప్రాంతంలో దళితుల సమస్యల పరిష్కారంతో పాటు వారి అభ్యున్నతికి వివిధ శాఖల ద్వార మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతో నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేయించడం అభినందనీయమన్నారు. రాంపర్వతాలు మరిన్ని అవార్డులు సాధించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌గౌడ్, బుచ్చయ్య, అంజయ్య గౌడ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు



అమ్రాబాద్: తీసుకున్న రుణాలు చెల్లించని రైతులను సింగిల్‌విండో అధికారులు ఇబ్బంది పెట్టొద్దని యురేనియం వ్యతిరేక జేఏసీ చైర్మన్ నాసరయ్య డిమాండ్ చేశారు. కరోనా కారణంగా రైతులు నష్ట పోయారని, ఈ వానాకాలం పంటల దిగుబడి లేక మరింత నష్ట పోయారని వివరించారు. ఇలాంటి క్లిష్ట సమయంలో రైతులు రుణాలు చెల్లించే పరిస్థితి ఇబ్బందిగా ఉందని తెలిపారు. వాయిదాలు చెల్లించక పోతే రైతుల భూములను వేలం వేస్తామని, వారి భూముల్లో జెండాలు పాతడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ఆయన వెంట శ్రీశైలం, నరహరి, తిరుపతయ్య, ఎల్లస్వామి తదితరులు ఉన్నారు.

శివస్వాములకు పండ్లు, అన్నప్రసాదం



కందనూలు: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలం దేవస్థానానికి కాలినడకన వెళ్లే శివస్వాములకు శనివారం పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పండ్లు, అన్నప్రసాద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ బస్టాప్ ఎదురుగా శ్రీ లలితా సహస్ర నామ సేవా సమితి, కొల్లాపూర్ చౌరస్తాలోని జ్ఞానేశ్వర వాత్సల్య మందిర్‌లో కుమారస్వామి చారిటబుల్ సేవా ట్రస్ట్ నాగర్‌కర్నూల్ వారి ఆధ్వర్యంలో కాలినడకన వెళ్లే శివస్వాములకు, పాదాచారులకు అన్నప్రసాదం, పండ్లు, ఫలహార పంపిణీ చేశారు. కార్యక్రమంలో లలిత సహస్రనామ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలోని స్థానిక శివాలయం ఆవరణలో శనివారం శివస్వాములు మహాపడిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో అర్చకులు శంకరయ్య ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు.

ఆలయ పునరుద్ధరణ పనులు

అచ్చంపేట రూరల్: తనకు ఊరిపై ఉన్న మమకారంతో ఓ యువకుడు శిథిలావస్థకు చేరిన ఆంజనేయస్వామి దేవాలయాన్ని తన సొంత డబ్బులతో పునరుద్ధరించారు. మండలంలోని మన్నెవారిపల్లికి చెందిన మందడి రాహుల్‌రెడ్డి శిథిలావస్థలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయాన్ని మరమ్మతులు చేయించారు. ఇటీవల గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని పూర్తి స్థాయిలో తెరిపించడంతో భక్తులు నిత్యపూజలు చేస్తున్నారు.

పరామర్శ



వెల్దండ: మండల పరిధిలోని పోతేపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన యువకులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. మృతదేహాలు శుక్రవారం రాత్రి ఇంటికి చేరడంతో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, జాతీయ బీసీ మాజీ కమిషన్ సభ్యులు ఆచారి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ యడ్మ సత్యం వేరు వేరుగా వచ్చి బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ఎమ్మెల్సీ రూ.10వేల చొప్పున, మున్సిపల్ చైర్మన్ సత్యం రూ.5వేల చొప్పున అందజేశారు.

నాగర్‌కర్నూల్ రూరల్: మండల పరిధిలోని కుమ్మెరలో దాడిలో గాయపడిన బాలస్వామి, లింగమ్మలను మత్స్యకార్మిక సంఘం నాయకులు గూళ్ల హరికృష్ణ, పెనుగోళ్ల మిత్రబృందం సభ్యులు పరామర్శించారు.

కాంగ్రెస్ స్పోర్ట్స్ సెల్ వైస్ చైర్మన్‌గా రాహుల్‌రెడ్డి

అచ్చంపేట రూరల్: యూత్ కాంగ్రెస్ స్టేట్ స్పోర్ట్స్ సెల్ వైస్ చైర్మన్‌గా మండలంలోని మన్నెవారిపల్లికి చెందిన మందడి రాహుల్‌రెడ్డిని ఎంపిక చేశారు. ఈ మేరకు ఆయనకు శనివారం నియామకపత్రం అందజేశారు. ఈ మేరకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తెలకపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నముద్దునూరుకి చెందిన రాములు ఈనెల 9న రాత్రి జరిగిన ప్రమాదంలో గాయపడగా హైదరాబాద్‌లో ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపా రు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నియామకం



ఫయాజ్

కొల్లాపూర్: ప్రపంచ శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన ఎస్ .ఎండీ ఫయాజ్ నియమితులయ్యారు. శనివారం హైదరాబాద్‌లో ప్రపంచ శాంతి సంఘీభావ సంఘం మూడో మహాసభలు నిర్వహించారు. ఈ సభలో రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఫయాజ్‌ను ఎంపిక చేశారు.

చిన్నచూపు తగదు

కల్వకుర్తిరూరల్: దక్షిణ తెలంగాణపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దయ్య యాదవ్ ఆరోపించారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన మత్స్య కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరంపై చూపిస్తున్న ప్రేమ పాలమూరు–రంగారెడ్డిపై ఎందుకు లేదని ప్రశ్నించారు.

పాదయాత్రను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

బిజినేపల్లి: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జనగాం నుంచి రంగారెడ్డి వరకు నేటి నుంచి ఫిబ్రవరి 28వ తేది వరకు నిర్వహించే పాదయాత్రను విజయవంతం చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు కోరారు. శనివారం మండల కేంద్రంలో పాదయాత్రకు చెందిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని, 51 జీఓ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి గొర్ల స్వామి, ఉపాధ్యక్షుడు బొల్ల మల్లేష్, గొండ్ల మైబూస్, రామకృష్ణ, మల్లికార్జున్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వల ద్వారా సాగునీరు వదలాలి



నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులు

కోడేరు: జొన్నలబొగుడ రిజర్వాయర్ నుంచి రైతుల పంట పొలాలకు సాగునీరు అందించాలని రైతులు, సీపీఎం నాయకులు కోరుతున్నారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు బుచ్చన్న మాట్లాడుతూ గత వారం రోజుల క్రితం ముత్తిరెడ్డిపల్లి గ్రామ శివారులో కేఎల్ఐ ప్రధాన కాల్వ తెగిపోవడంతో సాగునీరు నిలిచిపోయిందన్నారు. పంట పొలాలకు సాగునీరు రాక ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. తెగిపోయిన కాల్వకు మరమ్మతులు పూర్తి చేయలేదన్నారు. పంటలు ఎండుదశకు చేరుతున్నారని కాల్వలో నిలబడి నిరసన తెలిపారు. వెంటనే ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి మరమ్మతులు చేసి సాగునీరు విడుదల చేయాలని వారు కోరారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మన్ననూర్: రాష్ట్రంలో బీజేపీ గెలుపే ధ్యేయంగా ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు పిలుపునిచ్చారు. స్థానిక పండిట్ నరేంద్రజీ భవనంలో శనివారం అమ్రాబాద్ మండల కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు ఎప్పుడైన వచ్చే అవకాశం ఉన్నందున కార్యకర్తలు బీజేపీ గెలుపు కోసం సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ క్రమంలో ప్రతి కార్యకర్త కూడా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి ఒక్కరికి చేరవేసేలా ప్రయత్నలు ముమ్మరం చేయాలని అన్నారు. అంతకు ముందు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మండికారి బాలాజీ, మంగ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు గోలిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు నీలం రవి, బొడ్డు శ్రీనివాసులు, అనిల్, శేఖర్, శాంతికుమార్, కృష్ణయాదవ్, వంశీ, శివ, భరత్, సందీప బాలకృష్ణ, మల్లికార్జున్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన మిరప రైతులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

తాడూరు: మిరప పంటతో నష్టపోయే రైతులకు ఎకరాకు రూ.లక్ష నష్టపరిహారం ఇవ్వాలని రాష్ట్ర రైతు సంఘం సహాయ కార్యదర్శి వార్ల వెంకటయ్య డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గుంతకోడూరులో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో దాదాపు వెయ్యి ఎకరాల్లో రైతులు కుబేరా కలాస్ కంపెనీకి చెందిన మిరప విత్తనాలతో సాగు చేశారు. ఒక్కొక్క రైతు 10, 5 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. పంట దిగుబడి తగ్గడంతో పాటు ఎండిపోయి కుల్లు తెగులు, దుంప తెగులు రావడంతో గుంపులు గుంపులుగా మొక్కలు పూర్తిగా ఎండిపోయాయన్నారు. అధికారుల దగ్గరకు వెళ్లి మిరప పంట చనిపోతుందని చెప్పడంతో వారు రాసిచ్చిన మందులను పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి ఖర్చు అయిందని అధికారులు వచ్చి పరిశీలించినా ఫలితంలేకుండా పోయిందన్నారు. అధికారులు, శాస్త్రవేత్తలు పరిశీలించి నష్టం అంచనా వేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ నాయకులు శ్రీనివాసులు, శ్రీశైలం, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

వెల్దండ: పేదప్రజలకు అండగా ఐక్యత ఫౌండేషన్ ఉంటుందని చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని చెర్కూర్‌కి చెందిన జంగయ్యకు శనివారం ఆరోగ్యం నిమిత్తం రూ.70వేల ఆర్థిక సాయం అందించామన్నారు. ఇటీవల జంగయ్య కిందపడి కాళ్లు విరిగింది.

లింగాల: మండల పరిధిలోని కొత్తకుంటపల్లికి చెందిన సుల్తాన్‌బీ(75) వృద్ధురాలు శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న సింగిల్ విండో చైర్మన్ జంబుల హన్మంత్‌రెడ్డి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

శనైశ్వరుడికి పూజలు



పూజల్లో భక్తులు

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ శనైశ్వర స్వామికి భక్తులు శనివారం తెల్లవారుజాము నుంచే తిలతైలాభిషేక పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. శివుడికి వివిధ రకాల అభిషేకాల అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు శివలింగ దర్శనం అనంతరం ప్రత్యేకంగా పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పూజల్లో ఆలయ అర్చకుల శాంతకుమార్, ఉమ్మయ్య, కమిటీ సభ్యులు, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కోడేరు: మండల కేంద్రంలో మినీ స్టేడియం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని శనివారం బీఆర్‌ఎస్ యువ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మినీ స్టేడియం ఓపెన్ జిమ్ లేకపోవడంతో యువకులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో మినీ స్టేడియం ఏర్పాటుకు రూ.50లక్షలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే మినీ స్టేడియం ఏర్పాటు చేస్తామని అన్నారు.

శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు

కల్వకుర్తి టౌన్: మహాశివరాత్రిని పురస్కరించుకొని కల్వకుర్తి డిపో నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలానికి ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో నుంచి ఈనెల 14వ తేదీ నుంచి 19వ తేదీ వరకు 20 ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నామని ఆయన అన్నారు. డిపో పరిధిలోని ప్రజలంతా ప్రత్యేక బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

తెలకపల్లి: ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ అత్యవసర 108 అంబులెన్స్ సర్వీసులో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు కల్వాది కురుమూర్తి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈఎంఆర్ఐ గ్రీన్‌హెల్త్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 108 అత్యవసర సేవల ఈఎంటీ పైలెట్ పోస్టులకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పోస్టులకు సైన్స్‌లో డిగ్రీ, డిప్లమా ఇన్ ఈఎంటీ, బీఎస్సీ, బీజెడ్సీ, బీఎస్సీ నర్సింగ్, బీఫార్మసీ, ఇతర పారామెడికల్ కోర్సులు ఉన్నవారు అర్హులన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా పనిచేయాలని, 30 లోపు వయస్సు ఉండాలన్నారు. పైలెట్ పోస్టుకు తగిన అర్హతలు ఉండాలని తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 14లోగా పాలెం డీఎంహెచ్ఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు నంబర్.9666036032, 9581517828లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా నిజాం



కల్వకుర్తిరూరల్: కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని మార్చాలకు చెందిన నిజాంను నియమించారు. 40ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి నిజాముద్దీన్ సేవలందిస్తున్నారన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, జిల్లా అధ్యక్షుడు రహెమాన్‌లు ఆయనకు నియామకపత్రం అందజేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

కొల్లాపూర్: కార్మిక రంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 14న హైదరాబాద్‌లో బీఎంఎస్ ఆధ్వర్యంలో చేపట్టే ధర్నా కార్యక్రమం పోస్టర్లను శనివారం కొల్లాపూర్‌లో ఆవిష్కరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, బీఎంఎస్ జిల్లా కార్యదర్శి మలిశెట్టి చంద్రశేఖర్‌లు సంయుక్తంగా పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఎంఎస్ డివిజన్ కార్యదర్శి నర్సింహ, ఆటోయూనియన్ నాయకులు వెంకటేష్, కేశవులు, మహేష్, రవి, మల్లేష్, ఆంజనేయులు తదితరులున్నారు.

మంత్రాలమ్మ ఆలయంలో పూజలు

కోడేరు: మండల పరిధిలోని జనుంపల్లి శివారులో మంత్రాలమ్మ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో భాగంగా ప్రత్యేక పూజల నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

వార్డుల్లో పారిశుద్ధ్య పనులు



లింగాల: మండల కేంద్రంలోని ఆయా వార్డులలో పారిశుద్ధ్య పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సామాజిక కార్యకర్త కాత్రావత్ రాంజీనాయక్ పంచాయతీ అధికారులను కోరారు. శనివారం ఆయన బంజార సంఘం నాయకులతో కలిసి 5, 6, 7, 8 వార్డులలో పర్యటించారు. మురుగు కాల్వల్లో నిల్వ ఉంటున్న నీటితో ప్రజలు రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని సామాజిక కార్యకర్త ఆందోళన వ్యక్తం చేశారు. వార్డులలో నెలకొన్న సమస్యలను వార్డు సభ్యులు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బంజార నాయకులు లక్ష్మణ్‌నాయక్, భోజ్యానాయక్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



కల్వకుర్తిరూరల్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం మండలంలోని యంగంపల్లిలో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. రాహుల్ గాంధీ పాదయాత్ర దేశంలో నూతన చరిత్ర సృష్టించిందన్నారు. కార్యక్రమంలో వంశీ, వెంకటయ్య, మోహన్‌రెడ్డి, నర్సింగరావు, హరీష్, భాస్కర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కోడేరు: కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కొల్లాపూర్ అభివృద్ధి చెందిందని కాంగ్రెస్ పీసీసీ సభ్యుడు చింతపల్లి జగదీశ్వర్‌రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని బావాయిపల్లి, జనుంపల్లిలో హాథ్ సే హాథ్ జోడో యాత్రను నిర్వహించారు. కాంగ్రెస్ జెండాను కొల్లాపూర్ కోటపై ఎగురవేయాలన్నారు. అనంతరం కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు.

నేడు ధర్నా

అమ్రాబాద్: విద్యుత్ కోతలకు నిరసనగా మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం ధర్నా నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ మండల వర్కింగ్ అధ్యక్షుడు హరినారాయణగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పదిన్నర గంటలకు నిర్వహించే ఈ ధర్నాకు మాజీ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ హాజరవుతున్నారని, అందరూ హాజరుకావాలని కోరారు.

పెంట్లవెల్లి: మండల పరిధిలోని జటప్రోల్‌లో హాథ్‌సే హాథ్ జోడోయాత్రలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగినేని అభిలాష్‌రావు , మండల అధ్యక్షుడు నరసింహయాదవ్ పాల్గొన్నారు.

ప్రసాద్ వ్యాఖ్యలపై నిరసన

అమ్రాబాద్: హైదరాబాద్‌కు చెందిన హమార ప్రసాద్ అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ సంఘం, వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు ఎల్లస్వామి, లక్ష్మీనారాయణ, నాసరయ్య, మల్లేష్, మోహన్, యాదయ్య తదితరులు ఉన్నారు.

కొల్లాపూర్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పట్ల ట్విట్టర్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్ దిష్టిబొమ్మను శనివారం కొల్లాపూర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో మాలల చైతన్య సమితి నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హమారా ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నాగర్‌కర్నూల్ రూరల్: అంబేద్కర్‌ను అవమానించిన ప్రసాద్‌పై కేసు నమోదు చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జట్టి ధర్మరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో దళిత సంఘాలు, కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న, దండోరా రాష్ట్ర కార్యదర్శి గోపి, మహిళా సంఘం నాయకులు రేణుక, లక్ష్మి, బాలమణి, ప్రభాకర్, బీసీ సంఘం నాయకులు వెంకటయ్య పాల్గొన్నారు.



ఫిర్యాదు చేస్తున్న వివిధ సంఘాల నాయకులు




దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

బిజినేపల్లి: ఆనందగిరి లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 8వ తేది నుంచి ప్రారంభమైన జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభరాజుల బండలాగుడు పోటీలు శనివారం నాలుగో రోజు రసవత్తరంగా జరిగాయి. ఈ పోటీల్లో హుజూర్‌నగర్ నుంచి సుంకి సురేందర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ నుంచి డా.అఖిలేష్, చిలకలూరిపేట పల్నాడు జిల్లా నుంచి హైమావతిలు బహుమతులు గెలుపొందినట్లు సర్పంచ్ బాలీశ్వర్ తెలిపారు.

ఎమ్మెల్సీగా మాణిక్ రెడ్డిని గెలిపించాలి



మాట్లాడుతున్న జంగయ్య

కందనూలు: వచ్చేనెల 13న జరిగే మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూటీఎఫ్ బలపరుస్తున్న అభ్యర్థి పాపన్నగారి మాణిక్ రెడ్డిని గెలిపించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో సమావేశ మందిరంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కృష్ణ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ శర్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు చిన్నయ్య, శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు రమాదేవి, కోశాధికారి బాల్ రాజు, జిల్లా కార్యదర్శులు చంద్ర శేఖర్, రామేశ్వరయ్య, రాంచంద్రు, లలితాబాయి, లక్ష్మణ్, శ్రీనివాస్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నెహ్రూ ప్రసాద్ పాల్గొన్నారు.